క్లుప్తంగా

బోరుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: మూడు నెలలుగా జగనన్న కాలనీలో బోరు పనిచేయక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈనెల 21వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ×పనిచేయని బోరు .. పట్టించుకోని అధికారులు అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు మంగళవారం బోరుకు మరమ్మతు చేయించారు. ట్రాన్స్‌ఫార్మర్ లోపల ప్రమాదకరంగా ఉన్న స్టాటర్ బాక్సును బయట స్తంభానికి ఏర్పాటు చేశారు. మరో బోరువద్ద వృథాగా నీరు వెళ్తుండగా మరమ్మతులు చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బోరు బాగు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

విద్యార్థులకు కరాటే కిట్ పంపిణీ



కరాటే కిట్‌లను అందజేస్తున్న మొర్రిపిచ్చియ్య

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మొర్రిపిచ్చయ్యయాదవ్ తన సొంత ఖర్చులతో కరాటే కిట్‌లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే కిట్‌లను అందజేయడం గొప్పవిషయమన్నారు. దాతల సహాయంతో విద్యార్థులు కరాటేను అంకిత భావంతో నేర్చుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మొర్రిపిచ్చయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కంభం నూతన సర్కిల్ కార్యాలయం ప్రారంభం

కంభం: జిల్లాల పునర్విభజనలో భాగంగా కంభం నూతన సర్కిల్‌గా ఏర్పడింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని చౌక్ సెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని తొలగించి దాని స్థానంలో నూతన సర్కిల్ కార్యాలయాన్ని నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనుండగా ముఖ్య అతిథులుగా ఎస్పీ మలికా గర్గ్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు హాజరవుతారన్నారు.

నేడు అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేతుల మీదుగా బుధవారం జరుగుతుందని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు తెలిపారు. రూ.1.20 కోట్ల నాబార్డ్ నిధులతో అదనపు తరగతి గదులు నిర్మిస్తారన్నారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

బత్తాయిలో వేరుకుళ్లు నివారణ చర్యలు చేపట్టాలి

తాళ్లూరు: బత్తాయి తోటలను వేరుకుళ్లు తెగులు అధికంగా ఆశిస్తోందని, నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు రైతులకు సూచించారు. మండలంలోని నాగంబొట్లపాలెం, రామభద్రాపురంలలో బత్తాయి తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో రెండు వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతోందని తెలిపారు. తెగులు సోకిన చెట్లను గమనించి, నివారణ చర్యలు వివరించారు. వీఏఏ శ్రీను పాల్గొన్నారు.

హత్య కేసులో న్యాయం కోరుతూ దీక్ష

మార్కాపురం: యర్రగొండపాలెంలో వ్యాపారి ఆదినారాయణ హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు మంగళవారం మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. భార్య సుజాత, కుటుంబ సభ్యులు దీక్షలో కూర్చుకున్నారు. సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌కు వినతి పత్రం అందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తర్లుపాడు: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తర్లుపాడు మండల కేంద్రంలోని నాయుడుపల్లి కాలనీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఆటో బోల్తా పడటంతో చెన్నారెడ్డిపల్లికి చెందిన పి.పుల్లారెడ్డి కాలికి బలమైన గాయం కాగా తర్లుపాడుకు చెందిన ఆంజనేయులు, బాలనాగమ్మ, బీబీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను అంబులెన్సులో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. పుల్లారెడ్డికి మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేట తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు.

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం

- పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకంలో గడప గడపకు మన ప్రభుత్వం



త్రిపురాంతకంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు పథకాలపై వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం మద్దతుగా నిలవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం దగ్గులవారివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం గతంలో జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ వారి కోసం పనిచేసి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారని, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీల కతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను తెచ్చారని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అందిస్తున్నందున అర్హులైన వారంతా పథకాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ కే తులసి మల్లికార్జుననాయక్, ఏఓ కే నీరజ, హౌసింగ్ డీఈ రమేష్, ఏఈలు మహంకాళి, మంగారావు, ఏపీవో సుజాత, ఏపీఎం కృపమ్మ, ఈఓ ఆర్‌డీ మురళీమోహన్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నక్కా చిన్న త్రిపురరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున్, సత్యనారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, శేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.

జగనే నా బలం.. జనమే నా బలగం

- గడప గడపలో ఎమ్మెల్యే కేపీ
- ఇళ్ల స్థలాల పంపిణీపై చంద్రబాబువి పిచ్చిమాటలు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాను సేవకుడినని, ఆయనే తన బలమని, సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలోనే తాను సంతోషపడుతున్నానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ప్రజల ఆనందమే తన లక్ష్యమని చెప్పారు. మంగళవారం సాయంత్రం మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏకలవ్య కాలనీ శాంతి నగర్ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, చంద్రబాబు ఇళ్ల స్థలాలపై పిచ్చిమాటలు మాట్లాడటం మంచిది కాదన్నారు. మార్కాపురం పట్టణంలో 6800 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. సెంటు స్థలంపై చంద్రబాబు నాయుడు పేదలను అవమానించేలా మాట్లాడడం సరికాదన్నారు.

నాలుగేళ్ల పాలన అద్భుతం

సీఎం జగన్ నాలుగేళ్ల పాలన అద్భుతంగా సాగుతోందని, నూటికి నూరు శాతం హామీలన్నీ అమలు చేసి ప్రజల మనసుల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. కుల, మత, పార్టీ, వర్గ భేదాలు లేకుండా గ్రామ స్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తూ దేశానికే ఆదర్శవంతమైన పరిపాలన ఇస్తున్నారని చెప్పారు.

ఘన స్వాగతం

గడప గడపకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు, వైఎస్సార్ సీపీ అభిమానులు పూలతో, తప్పెట్లు, మేళతాళాలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్ పీవీ నాయుడు, కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, దొడ్డా భాగ్యలక్ష్మి, షెక్షావలీ, వార్డు ఇన్చార్జ్‌లు ఉత్తమ్‌కుమార్, మయూరి కాశీం, మైనార్టీ అధ్యక్షుడు ఉస్మాన్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, గుంటక వెంకటరెడ్డి, యం వరప్రసాద్, పాపిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పేదల ఇళ్లలో దీపాలు వెలిగిస్తున్నారు

- చంద్రబాబు ఆ నివాసాలను శ్మశానాలనటం దుర్మార్గం
- గడపగడపలో సమస్యలు పరిష్కరిస్తున్నాం
- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవానికి స్థలంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి వారి నివాసాల్లో దీపాలు వెలిగిస్తున్నారని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఇంటింటికీ తిరిగి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు కౌన్సిలర్ మోహన్‌బాబు దుశ్శాలువాలు, పూల మాలలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఎక్కువగా నివాసాలు, ఇళ్ల స్థలాలు అడుగుతున్నారని చెప్పారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు పాలన చూసిన ప్రజలు విసిగి వేసారి 23 సీట్లు ఇచ్చి ఆయన రాజకీయ జీవితానికి సమాధి కట్టి సరైన బుద్ధి చెప్పారన్నారు. అయినా చంద్రబాబుకు బుద్ధి రాలేదని, ఇప్పటికీ బుద్ధిలేని మాటలే మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల సొంతింటి కల నెరవేరుస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతుంటే సహించలేని చంద్రబాబు ఆ నివాసాలను శ్మశానాలతో పోల్చడం దుర్మార్గమన్నారు. 60 అడుగుల రోడ్లతో దర్శి నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ప్రజలు సంతోషంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలే మళ్లీ సరైన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, కౌన్సిలర్లు మేడం మోహన్ రెడ్డి, వీసీరెడ్డి, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, డీటీ రవి శంకర్, ఎస్సై రామకృష్ణ, ఏఈ ప్రసాద్, కమిషనర్ మహేష్, నాయకులు గంజి వెంకటేశ్వరరెడ్డి, హరీష్, జగన్, జయశింహారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ మృతి

- పరామర్శించిన మంత్రి సురేష్

పెద్దదోర్నాల: అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ రెండో సచివాలయ కన్వీనర్ పులుకూరి ఇజ్రాయేల్ (53) సోమవారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హుటాహుటిన మండల కేంద్రానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో చురుకైన కార్యకర్తను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ దూదేకుల రసూల్ ఇజ్రాయేల్ కుటుంబానికి 50 వేల రూపాయలు అందజేశారు. పార్టీ అధ్యక్షులు గంటా వెంకట రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, కిరణ్ కిశోర్ కుమార్, దూదేకుల రసూల్, శీలం అబ్రహం ఉన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీబీయస్‌ఈ బోర్డు విధానంలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి అర్హులైన గిరిజన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబు తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, హెచ్‌ఈపీ గ్రూపులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. 10 తరగతి పాసైన గిరిజన విద్యార్థినులు www.a ptwf ur uk u am.a p.go-v.i n వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే అనాథ పిల్లలు, వికలాంగులు, కోవిడ్‌లో తల్లిదండ్రులు చనిపోయిన వారు, సైన్యంలో పని చేస్తూ చనిపోయిన వారి పిల్లలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంతోషం

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: నవరత్నాల పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని, ఆ పథకాల ద్వారా ఆయా కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయంలోని పి.పొట్టిరెడ్డిపల్లె, రౌతుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందచేస్తూ ప్రభుత్వ పనితీరును వివరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియచేసి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రతి గడపలో 100 శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు, గ్రామసర్పంచ్ హటేల్‌పీరా, కొమరోలు మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ బోయిళ్ల జనార్ధన్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు బుధవారం రాజుపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. రాజుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి



ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

త్రిపురాంతకం: ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు.

☛ త్రిపురాంతకంలో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ప్రారంభించిన ఆయన ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహకాలు అందుతున్నాయన్నారు. చేపలు, రొయ్యల వలన పోషక విలువలగల ఆహారం లభిస్తుందని చెప్పారు. ఫిషరీస్ జేడీ చంద్రశేఖరరెడ్డి, ఎఫ్‌డీఓ రవికుమార్, డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంఆర్‌ఓ కిరణ్, ఎంపీడీఓ మరియదాస్, ఫిషరీస్ అసిస్టెంట్ మధుప్రసాద్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, కన్వీనర్ ఎస్. పోలిరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు వందనం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జురరెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ, మున్సిపల్ చైర్మెన్ కృష్ణ

మార్కాపురం టౌన్: అనునిత్యం ప్రజలతో మమేకమై అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ల సేవలకు వేల వందనాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వివిధ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణతో కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలను వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు సన్నాహాలు చేయడం గర్వకారణమన్నారు. గత ప్రభుత్వ పాలనలో అర్హులైన వారికి ఒక్క పథకం రావాలంటే అష్టకష్టాలు పడేవారని, నేడు అటువంటి పరిస్థితి లేదన్నారు. అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛను అందించడం వల్ల సంతోషంగా ఉన్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణ పరిధిలో వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు సిరాజ్, దొడ్డా భాగ్యలక్ష్మి, మారంరెడ్డి లతక్రిష్ణరెడ్డి, కొట్టే రామలక్ష్మమ్మ, 3వ వార్డు ఇన్చార్జి ఎ.వంశి, కమిషనర్ గిరికుమార్, డీఈ సుభాని తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని కూలిన విద్యుత్ స్తంభం

ముండ్లమూరు: మండలంలోని చింతలపూడి గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాన్ని మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో విరిగిపడింది. 33 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ భూరాజు సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కానిస్టేబుల్‌కు పాముకాటు

- గుంటూరు వైద్యశాలలో చికిత్స
- పరామర్శించిన దర్శి డీఎస్పీ, సీఐ, ఎస్సైలు



పాము కాటుకు గురైన పవన్‌కుమార్

తాళ్లూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ పవన్‌కుమార్ తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో ఆర్–5 జోన్ వద్ద బందోబస్తు విధులకు హాజరయ్యారు. సోమవారం రాత్రి అక్కడి షెడ్‌లో నిద్రిస్తుండగా బుజం వద్ద ఏదో కుట్టినట్లు అనిపించడంతో చేత్తో విదిలించాడు. తోటి ఉద్యోగులు అప్రమత్తమై పవన్‌ను కుట్టింది పాము అని గుర్తించి చంపేశారు. పవన్‌కు బుజంతోపాటు చేతి వేలుపై పాము కాట్లు పడ్డాయి. ప్రస్తుతం గుంటూరు రమేష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పవన్‌ను దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐ రామకోటయ్య, ఎస్సై ప్రేమ్‌కుమార్‌తోపాటు పలువురు ఎస్సైలు పరామర్శించారు.

నాలుగేళ్ల పాలన సువర్ణాధ్యాయం

- 98 శాతం హామీలు అమలు పరిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా 175 సీట్లు పక్కా
- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలను క్లీన్ స్వీప్ చేయడం పక్కా అని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా దర్శిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన సీఎం దేశ మొత్తం మీద ఒక్క వైఎస్ జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. జగన్ పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు పాలన గుర్తుకు వస్తేనే రైతులు, సామాన్య ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పాలన ఒక సువర్ణ అధ్యాయం అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు చేస్తున్న మేలు చిరస్థాయిగా గుర్తుంటుందన్నారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి,గ్రీనరీ అండ్‌బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, ముండ్లమూరు ఎంపీపీ సునీతాబ్రహ్మానందరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, అంకాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నాగంబొట్లపాలెంలో మంగళవారం రాత్రి కేక్ కటింగ్‌తోపాటు ప్రజలకు అన్నదానం చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, స్థానిక సర్పంచ్ చిమటా సుబ్బారావు, సొసైటీ చైర్మన్ శనివారపు శ్రీనివాసరెడ్డి, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు సోము అనిల్ కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ షాప్‌లో చోరీ



చోరీకి పాల్పడుతున్న దొంగ

యర్రగొండపాలెం: స్థానిక ఓ జ్యూవలరీ షాప్‌లో మంగళవారం దొంగతనం జరిగింది. దాదాపు 15 గ్రాముల పాత బంగారాన్ని షాపులో నుంచి ఎత్తుకొని వెళ్లాడు. షాపు యజమాని తన పనినిమిత్తం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో షాపును తెరచి ఉంచి బయటికి వెళ్లడాన్ని గమనించిన ఆ దొంగ కొనుగోలు దారుడిగా ఆ షాపులోకి వెళ్లాడు. అక్కడ ర్యాకులో ఉన్న ఒక బాక్సును ఎత్తుకొని వెళ్లాడు. గుర్తు తెలియని ఆ యువకుడు పట్టణంలోని పలు జ్యూవలరీ షాపుల వద్ద తిరిగినట్లు తెలిసింది. దొంగతనం జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని, షాపు యజమాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

నాడు-నేడులో పనులు సకాలంలో పూర్తి చేయాలి

బేస్తవారిపేట: నాడు-నేడులో పాఠశాలల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో నాడు-నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట మండలంలో రెండో విడత నాడు-నేడులో 25 పాఠశాలలకు రూ.3.45 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ల నిర్మాణం, విద్యుత్, రన్నింగ్ వాటర్ పనులు ఈనెల చివరకు పూర్తి చేయాలన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జూన్ 10వ తేదీ నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ చెన్నకేశవరెడ్డి, ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దారితప్పిన వృద్ధురాలు కుటుంబ సభ్యుల చెంతకు..

కంభం: దారి తప్పి వచ్చిన వృద్ధ మహిళను కంభం పోలీసులు మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే మూడు రోజుల క్రితం ఒడిశా నుంచి రైలులో వెళ్తూ అపర్ణా బసులై అనే వృద్ధురాలు కంభం రైల్వే స్టేషన్‌లో దిగిన సమయంలో రైలు వెళ్లిపోయింది. భాష రాక పట్టణంలో తిరుగుతున్న ఆమెను సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కంభం పోలీసులకు అప్పగించారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆ వృద్ధురాలిని గిద్దలూరులోని సంజీవని ఫ్యూచర్ హెల్ప్ చారిటబుల్ ఫౌండేషన్ అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఒడిశాలోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో మంగళవారం వారు ఇక్కడికి చేరుకోగా ఎస్సై వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు వెంకట్‌ను ఎస్సై అభినందించారు.

వాటర్ ప్లాంట్‌కు జరిమానా

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు రంగస్వామికి రూ.5,10,717, కాంపౌండ్ రుసుం కింద రూ.27 వేలను జరిమానా విధించారు. విద్యుత్ విజిలెన్స్ అధికారులు అజయ్‌కుమార్, హైమవతి తమ సిబ్బందితో కలిసి 3 రోజుల క్రితం మోడంపల్లెలో వాటర్ ప్లాంట్‌కు అనధికారికంగా విద్యుత్ ఉపయోగిస్తున్నారని గుర్తించి అతడిపై కేసు నమోదు చేశారు.

కార్మికుల వేతనం పెంచాలి

మార్కాపురం: పలకల కార్మికుల వేతనం పెంచాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎస్టేట్ దగ్గర వై జంక్షన్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. కార్మికుల వేతనం పెంచకుండా చర్చల పేరుతో యజమానులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రెండేళ్ల క్రితం కార్మికుల వేతనం పెంచారని, ఆ అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసిందన్నారు. 8 గంటల డ్యూటీకి 310 రూపాయలు ఇవ్వాలని కోరుతున్నా యజమానులు ఒప్పుకోకపోవడం శోచనీయమన్నారు. కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చూడాలని కోరారు. యూనియన్ నాయకులు రూబెన్, బాలశేషయ్య, రాములు, బాజ్జీ, పుల్లయ్య పాల్గొన్నారు

రైతు ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ

కురిచేడు: మండలంలోని రెడ్డెన్నపల్లి, ఎన్‌ఎస్పీ అగ్రహారం గ్రామాల్లో గతంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను కనిగిరి ఆర్డీఓ తోట అజయ్‌కుమార్ మంగళవారం రాత్రి విచారించారు. రెడ్డెన్నపల్లి గ్రామానికి చెందిన కాసు గురవారెడ్డి గత ఏడాది జూలై 22న, ఎన్‌ఎస్పీ అగ్రహారం గ్రామానికి చెందిన అవులూరి ఏడుకొండలురెడ్డి సెప్టెంబర్ 2021లో ఆత్మహత్య చేసుకున్నారు. మండల కమిటీ నివేదిక ఆధారంగా ఆ రెండు కుటుంబాలను విచారించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్, సిబ్బంది ఉన్నారు.